# తాజ్‌మహల్



యం. ఉమామహేశ్వరరావు

యమునానది గంభీరంగా, చప్పుడురాని అడుగులువేస్తూ నడుస్తున్న మృగరాజులా కదుల్తోంది.

పైన వెన్నెల లోకానికి మురిపాల వెలుగులుపోస్తూ మురిసిపోతోంది. యమున మధ్యలో అక్కడక్కడా బుడుంగుమని మునిగి తేల్తూవున్న చిన్న చిన్న చేపలు వెన్నెల విందులు ఆరగిస్తూ మరల మునిగిపోతున్నాయి. నీలిరంగు చీర తెల్లటి బోర్డరులా ఒడ్డుపైన అక్కడక్కడావున్న చిన్నచిన్న కట్టడాలు వెన్నెలకాంతికి మెరుస్తున్నాయి.

చుట్టూ నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. అక్కడకు కొంతదూరంలో ఆగ్రాకోట పుడమితల్లి ఒంటిమీది పచ్చలహారంలా ధగధగా మెరిసిపోతోంది.

అంతా నిశ్శబ్దం...

గాలి చల్లగా స్పర్శిస్తోంది. ఆ సమయంలో ఆ చీకటినికోస్తున్న వెన్నెల కిరణాల కాంతులు పడుతున్న యమున ఒడ్డులో ఎవరిదో నిశ్శబ్దరోదనం యమున గర్భాన్ని చీల్చుకుంటూ... గాలిని దూసుకుంటూ నిశ్శబ్దప్రకృతి ఎదలో శబ్దభేదితో ఛేదించినట్లుగ్గా వినిపిస్తున్నదా రోదనం.

పగటి సూర్యుడి వెచ్చటి కిరణ కాంతులకు వడిపోయి, రాత్రి దిక్కుతోచక నిశ్శబ్దంగా శోధిస్తున్నట్లుగా ఉంది.

ఒడ్డును తాకుతున్న ఆగ్రా పరిసరంలో... ఆ సమయంలో... ఒంటరిగా... దిక్కులేనట్లుగ్గా... వస్తున్నదా రోదనం.

అక్కడక్కడా విసిరేసినట్లున్నాయి సమాధులు: భారతసర్వం సహా సామ్రాజ్యాన్ని నిరాటంకంగా పరిపాలించిన తురుష్క ప్రభువుల శరీరాలు విగత జీవాలుగా ఆ సమాధుల్లో శాశ్వతనిద్రలు చేస్తున్నాయి

రాజులు... పేదలు... శూరులు... ధీరులు... భాగ్యశాలురు... అభాగ్యులు... నిందితులు... అసాధ్యులు... కీర్తికాముకులు... ఎందరో ఆ నేలలో... ఆ మట్టి గర్భంలో నిద్రలు పోతూ జీవితంబుద్బుదం అనీ కీర్తి అజరామరం అనీ చాటుతున్నాయి.

ఒక్కొక్క సమాధిపై వాడివత్తలైపోయిన పూల చెండులు ఎన్నెన్నో ఉన్నాయి. విగతమైన వాటితో నేస్తం గట్టినట్లుగ... ఆ సమాధులపైన కరుణారసపూరితంగా పడివున్నాయవి.

అప్పుడు... అక్కడ... ఓ సమాధి దగ్గర మోకాళ్ళు రెండూ వంచుకుని, శిరస్సును నేలకు దించుకుని, ఆ నిశ్శబ్ద ప్రకృతిలో గుండెలనిండుగా గంపెడు దుఃఖంతో కుమిలి కుమిలి రోదిస్తున్నాడతను. ఆ రోదనలో గుండెలివిసే 'శక్తి'ఉంది... అతను షాజహాన్.

యమునకే మాట్లాడటం వస్తే?!...

ప్రకృతికే పలకరించడం వస్తే?!...

ప్రాణాలకు ప్రాణాలు ఫణంగా పెట్టే స్నేహితునిలా, అతని భుజంమీద తట్టి, కన్నీరు తుడిచి, హృదయానికి హత్తుకుని లాలించి ఉండెడివి. కానీ... యమున మాట్లాడలేదు మేళంగా కదుల్తోంది బాధతో... ప్రకృతి నెమ్మదిగా స్పర్శిస్తోంది కన్నులు నిండిన కన్నీటితో...

"జహాపనా!!"

ఎవరో వెనగ్గా నించుని తనను పిలిచినట్లయి వెనక్కు తిరిగాడతను.

ఆంతరంగిక సలహాదారుడూ, సచివుడూ, బంధువూ అయిన 'ఖాన్'నించుని ఉన్నాడు.

"ప్రభూ! సకల భారతసామ్రాజ్యాన్నీ నిరాటకంగా పరిపాలిస్తున్న ప్రభువు యిలా అర్ధరాత్రివేళలో... శ్మశాన భూమిలో, ఈ చిక్కటి నిశ్శబ్దంలో జాలిగా దుఃఖించదగునా?! నిర్భాగ్యుల గుండెల్లో కన్నీరు తుడిచి పన్నీరు చిలకరించే ప్రభువులు మీకీ దుస్థితి తగదు..."

షాజహాను కన్నుల్లో నీటి బిందువులు జలజలా రాలేయి. "నా ముంతాజ్ లేని ఈ సామ్రాజ్యాధిపత్యం నాకొక గడ్డిపోచతోసమానం... నా జీవితంలో వెలుగులు నింపి, తను చీకట్లోకి నడిచింది. తన కనుసన్నల్లో నన్ను నడిపించి, తను 'కాలపాశం'వెంట కదిలి వెళ్ళిపోయింది..."

ఖాన్ షాజహాన్‌వంక అయోమయంగా చూసేడు.

"అవును ఖాన్... అందుకే... నా ముంతాజ్ చనిపోలేదు. బ్రతికే ఉండాలి... ఆమె ఉనికి అమరంగావాలి... అందుకు నా జీవిత సర్వస్వాన్నీ ధారపోస్తాను. ఆమె సమాధిపై 'మహల్'నిర్మిస్తాను... ఈ సర్వ ప్రపంచంలోని సౌందర్యాన్నంతా ప్రోగుచేసి... రాసిపోసి... పోతపోస్తాను..."

స్థిర నిశ్చయంతో హఠాత్తుగా లేచేడతను. అతని చూపులు మారేయి. ఆ చూపుల్లో పట్టుదల ఝరీ ప్రవాహంలా కదుల్తోంది. ఆ కన్నుల కాంతుల్లో భావి భారతదేశానికి ప్రపంచ ప్రఖ్యాతిని సంపాదించిపెట్టే ఓ అంధమైన... సుందరమైన... మహల్ నిర్మాణం...

"అవును... అది షాజహాను తన భార్య ముంతాజ్‌కోసం నిర్మించబోయే అపురూప మహల్... తాజ్‌మహల్... తాజ్‌మహల్...

* * *

ఆ ఇంట్లోకీ— వరండాలోకీ అప్పటికి ఏ పదిసార్లో తిరిగాడు రామచంద్రం.

అడుగు తీసి, అడుగు వేస్తుంటే కాళ్ళ వణకసాగేయి. నరాలు స్వాధీనం తప్పినట్లయి ఒళ్ళు తూలసాగింది. అతని బలహీనమైన చేతులు ఆ ఇంట్లోని ప్రతీ అంగుళాన్నీ ఆప్యాయంగా, అచంచలప్రేమగా, ప్రీతిగా, ఆదరంగా స్పృజించాయి. అతని కళ్ళల్లో కన్నీటి చారికలు. తడిచారిక కనుకొలకులనిండా వెచ్చటి నీళ్ళు అతని వ్యధిత హృదయంలోంచి ఆర్తిగా... ఆవేదనగా... బయటకు వస్తున్నాయి. ఒకింతసేపు ఆగేడు. అతను అలా ఆగిపోయిన చోట, ఆ గోడమీద... జానకీదేవి ఫోటో...

కూర్చుని, చిర్నవ్వులు నవ్వుతూ... వెన్నెల జల్లుల్లాంటి చూపుల్ని ప్రసరిస్తూ రెండు ప్రక్కలా మాణిక్యాల్లాంటి యిద్దరు పిల్లల్ని నిలబెట్టుకుని ఉంది.

"జానకీ!!..." రామచంద్రం గొంతు గద్గదంగా అయిపోయింది. "అయిపోయింది జానకీ... ఇక... ఈ ఇంటికీ, నాకూ, అనుబంధం తీరిపోయింది. ప్రతినిముషం, ప్రతిగంటా, ప్రతిరోజూ, కళ్ళల్లో ఒత్తులు వేసుకుని, గుండెల్లో కాంక్షలు దాచుకుని, ఎంతో ప్రేమతో కట్టుకున్న మందిరం చేజారిపోతోంది... నీ కోరిక ప్రకారంగా, నీ అనురాగ చిహ్నంగా రాత్రింబగళ్ళు శ్రమించి నిర్మించుకున్న ఈ నిలయం, నా గుండెల్లోంచి, నా మనస్సులోంచి శాశ్వతంగా దూరమయ్యే పరిస్థితి ఎదురైంది జానకీ!!"

రామచంద్రం దృష్టి ఫోటోలో, జానకీదేవి ప్రక్కనే నించుని చిలిపిగా, అమాయకంగా, ఆనందంగా నించుని చూస్తున్న కొడుకులపైన పడింది.

"అవును... వీళ్ళే! వీళ్ళే జానకీ... వీళ్ళే యిప్పుడు నా పాలిట శత్రువులైనారు. వీళ్ళే మన కలలపంటని పొంగిపోయాం. మన జ్ఞాపకాల తీపి సుధాబిందువులని ఆనందించాం. మన అనురాగ చిహ్నాలని మురిసిపోయాం... కాని, వీళ్ళు మనపాలిట శత్రువులైనారు. అనురాగం, ఆప్యాయత అనేపదాలకు ఎంతో దూరంగా వెళ్ళిపోయారు జానకీ! వీళ్ళిప్పుడు నేలవిడిచి సాము చేస్తున్నారు. నిప్పులకుంపటిని కాళ్ళక్రింద పెట్టేరు. మన దాంపత్యచిహ్నమైన ఈ ఇంటిచుట్టూ అనురాగ పందిరి వేస్తారని ఆశించాం— కానీ, వీళ్ళు ముళ్ళ పందిరి వేస్తున్నారు."

ఎంతో ఆవేదన ఉప్పెనలో మునిగిపోతూ నిస్సత్తువుగా అలాగే నేలమీద కూలబడి పోయాడు రామచంద్రం. అతని కళ్ళల్లో గతంకదిలింది. మనస్సు రవంతసేపు ఆ దృశ్యాల్ని మననం చేసుకుంది. సరిగ్గా పదేళ్ళు వెనక్కు రామచంద్రం వెళ్ళిపోయాడు.

* * *

ఆ గదిలో ఓ మంచంమీద పడుకుని ఉందామె. నీర్సంవల్ల ఎండిన కట్టెమాదిరిగా ఉందామె. ఆమె నుదిటిమీద పట్టిన స్వేదబిందువుల్ని ఆప్యాయంగా తుడుస్తూ కూర్చున్నాడు రామచంద్రం. ఆమె కాళ్ళ దగ్గరగా మురళీ, మధు బేలగా, దీనంగా నించుని తల్లినీ తండ్రినీ మార్చి మార్చి చూస్తున్నారు.

"ఏమండీ!!"

ఆ పిలుపుకు తలపైకెత్తి చూసేడు

**అవును వాళ్ళే ... వీళ్ళే జానకీ! వీళ్ళే ఇప్పుడు నా పాలిట శత్రువులైనారు. వీళ్ళేమన కలల పంటని పొంగిపోయాం. మన జ్ఞాపకాల తీపి సుధా బిందువులని ఆనందించాం. మన అనురాగ చిహ్నాలని మురిసిపోయాం ... కానీ, వీళ్ళు మన పాలిట శత్రువులైనారు. అనురాగం, ఆప్యాయత అనే పదాలకు ఎంతో దూరంగా వెళ్లిపోయారు జానకీ ...!**

రామచంద్రం.

ఆమె గొంతులోంచి వెలువడిన ఆ పిలుపుకు ఒకప్పుడైతే ఎంతోపరవశించి తన్మయం చెందేవాడే. ఆప్యాయంగా, అనురాగంతో ఆమె చెక్కిళ్ళను అలవోకగా స్పృశించేవాడే... తమకంతో గుండెలకు హత్తుకునేవాడే...

భర్తచూపుల్ని గమనించిందామె.

"పిల్లల్నీ, మిమ్మల్నీ వదిలివెళ్ళిపోతున్నాను. ఈ జన్మకింతే! మళ్ళీ జన్మంటూ వుంటే మీకు భార్యగానే పుడతాను.''ఆగిపోయిందామె. ఆమె గుండెల్లో ప్రకంపనాలు వెల్లువలా తీరం కోసం పరుగులిడుతున్నాయి.

ఆమె పరిస్థితిని అంచనా వేసుకున్నాడు రామచంద్రం.

"ఊరుకో జానకీ... ఎక్కువ మాట్లాడొద్దు. హాయిగా నిద్రపో!''

పిచ్చిదానిలా భర్తవంక చూసిందామె.

"నిద్రపోతానండి. తప్పకుండా నిద్రపోతాను. మీ మాట కలలోకూడా కాదనను. కానీ...''

మాటలు రావడంలేదు ఆమె గొంతులోంచి. దుఃఖంతో గొంతు పూడుకుపోయింది.

"జానకీ! కాసేపు మాట్లాడకు. నిద్రపో జానకీ... నిద్రపో... నువ్వలా మాట్లాడుతూ ఆయాస పడుతుంటే భరించలేకపోతున్నాను జానకీ!!''

కాని జానకి ఆగిపోలేదు. బరువుగా వాలుతున్న కనురెప్పల్ని బరువుగానే రెప రెపలాడించింది.

"జానకీ!! వీళ్ళకోసం నువ్వు బ్రతికి తీరాలి. వీళ్ళ లేతమనసులు తల్లిప్రేమకు దూరం కాకుండా ఉండేందుకైనా నువ్వు బ్రతకాలి జానకీ!!... బ్రతకాలి!...'' రామచంద్రం గొంతు గద్గదమైందీసారి.

"మీరున్నారు చాలు... మీ చల్లని నీడలో వాళ్ళు హాయిగా ఉంటారు...

ఆమె ఆగిపోయింది. ఆమె ఎందుకాగిపోయిందో?... ఎక్కడ ఆగిపోయిందో సరిగ్గా అక్కడినుంచే ప్రారంభించేడు రామచంద్రం.

"జానకీ...! నువ్వు కోరేదేవిటో, నీ మనసులో సుళ్ళు తిరుగుతున్న ఆ బాధేవిటో నేను గ్రహించాను జానకీ. నా జీవితంలో ఎన్నోవసంతాలు నీతోనే గడిచి మొగ్గలుకాచి, పూలు పూచేయి. మన జీవన నందన వనంలో పూచిన ఈ చిరుపూలను జాగ్రత్తగా కాపాడుకునే భారం నాది. అందుకు హామీ ఇస్తున్నాను. జానకీ... నువ్వు భాగం పంచుకున్న నా జీవితంలో మరొకరికి ఎన్నడూ స్థానం లేదు.''

"ఆవేశంగా అన్నాడు రామచంద్రం.

జానకి పెదాలపై నవ్వు పూచింది గమ్మత్తుగా... ఆమె కళ్ళు ఆ ఇంటినోసారి ఆప్యాయంగా పరిశీలించాయి. ఆ పరిశీలనలో ఆ ఇంటి మీద ఆమెకున్న మమకారం, ఆమెకున్న అనురాగం ఎంతో తెలుసును రామచంద్రానికి.

ఇల్లూ వాకిలీ లేకుండా అద్దెఇంట్లో ఎన్నాళ్ళోకాపురం చేసేరు.

"మనకంటూ సొంత ఇల్లుంటే బావుంటుంది కదూ!!''అన్న ఆమె కోరికను కాదనలేకపోయాడతను.

ఆఫీసులో తనకొచ్చే పీ.యఫ్.డబ్బూ, కొంత ఇన్సూరెన్స్‌లోనూ పెట్టి తీసుకుని, అందమైన చూడ చక్కటి ఇల్లు కట్టించేసేడు మరో ఆర్నెల్లలో.

'జానకీ నిలయం'



పేరును చూసి ఎంతో మురిసిపోయిందామె స్త్రీ హృదయం. తన మనస్సులోని కోరికను ఉన్నది ఉన్నట్లుగానే అమలు పరిచిన భర్తమీద ప్రేమ ఎంతో పెరిగిపోయింది.

ఆ రాత్రి రామచంద్రం బ్రతుకులో జానకి అనురాగవసంతం నింపినట్లు మరే రాత్రి నింపలేదు.

* * *

రామచంద్రం జ్ఞాపకాలకు తెరపడిందొక్కసారిగా.

ఎదురుగా ఫోటోలోంచి జానకి ఏమండీ! మీరు దుఃఖిస్తున్నారా??'' అన్నట్లుగా వినిపించింది.

"అవును జానకీ, దుఃఖంగాక మరేముంటుంది? నీకోసం, నీ ప్రేమకోసం, కష్టపడి నిర్మించుకున్న ఈ ఇంట్లో నువ్వు ఎన్నాళ్ళున్నావ్? ఇల్లుకట్టిన ఆర్నెల్లకే నీ తనువుచాలించావు. నీ కోరిక ప్రకారంగానే పిల్లల్ని కష్టపడి చదివించాను. పెద్ద వాళ్ళనుచేసి విద్యాబుద్ధులు చెప్పించి పెళ్ళిళ్ళు, ఈ ఇంటి వాకిట్లో, నీ ఇంటి వాకిట్లో చేసేను... కాని... కాని... వాళ్ళేంచేసారో చూసావుగా?!!! ఉద్యోగాలనే రెక్కలొచ్చి ఎగిరిదూరంగా వెళ్ళిపోయి కాపురాలు పెట్టేరు. ఇల్లు అమ్మేసి ఆస్తిలో భాగాలు వెంటనే పంచెయ్యమని కబుర్లుపెట్టేరు. కాని, జానకీ!! ఈ ఇల్లు నీది. ఈ వాకిలి నీది. ఈ ఇంట్లోని ప్రతీ అంగుళమూ నీదే. నాదనేది ఏవుందిక్కడ? అయినా వాళ్ళకు డబ్బుకావాలి. నీ ఈ జ్ఞాపక చిహ్నాన్ని అమ్మేసి తమకు వాటాలు పంచెయ్యమంటున్నారు.''

గొంతులోంచి మాటలిక రాలేదు రామచంద్రంకు.

ఒక్కనిముషం సేపు విశ్రాంతిగా వాలు కుర్చీలో కూర్చున్నాడు. వీధి తలుపు త్రోసుకుని వస్తూ కనిపించాడు నిరంజనం.

అతడు రామచంద్రం మిత్రుడు. పైగా విపరీతమైన అభిమానం ఉన్న మనిషి.

"నేను విన్నది నిజమేనా???'' నిరంజనం గొంతులోంచి వచ్చిందా ప్రశ్న.

* * *

"నిజమే ఖాన్.... నిజమే... ఈ షాజహాన్ జీవితంలో ఎప్పుడూ ఎక్కడా ఓటమి ఎరగడు. నా సర్వసామ్రాజ్యం ధారపోసి, నా ప్రజలరక్తమాంసాలు పిండి నిర్మించిన నా ముంతాజ్ ప్రేమ మందిరం అది. ఆమెకన్న బిడ్డలకు ఆ తల్లి జ్ఞాపక మందిరం అది... వారి హృదయాల్లో తల్లిపట్ల అనిర్వచనీయమైన అనురాగం ప్రవహిస్తుందని భావించేను. కానీ... కానీ... వాళ్ళు కర్కశులు ఖాన్!! కర్కశులు...

